

పరిహారమిచ్చి ఆదుకోవాలి

- పిడుగుపాటు బాధిత రైతుల వేడుకోలు

ప్రజాశక్తి -హుకుంపేట: పిడుగుపాటుకు దుక్కిటెద్దులను కోల్పోయిన తమను ప్రభుత్వపరంగా ఐటిడిఎ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత గిరిజన రైతులు సిందేరి అప్పారావు, పట్టం అప్పారావు కోరుతున్నారు. సోమవారం మధ్యాహ్నం వర్షంతోపాటు పడిన పిడుగులకు అ డవిలో మేతకు వెళ్లిన తమ దుక్కిటెద్దులు పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాయని వాపోతున్నారు. వీటి విలువ ఒక్కొక్కటీ రూ.70వేలు ఉంటుందని అంటున్నారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న సమయంలో దుక్కిటెద్దులను కోల్పోవడం వల్ల సాగు చేయడం కష్టమేనని, ప్రభుత్వపరంగా పరిహారమిచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా తమకు వేరే గత్యంతరం లేదని, ప్రభుత్వపరంగా జిల్లాకలెక్టర్, ఐటిడిఎ పిఒతోపాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించి ఆదుకునే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో జాప్యాన్ని ఉపేక్షించం : పిఒ



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అంగన్వాడీ భవన నిర్మాణాలలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ హెచ్చరించారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ భవన నిర్మాణాలు, నాడు నేడు పనుల పురోగతిపై సిడిపిఒలు, సూపర్ వైజర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమీక్షించారు
ఈ సందర్భంగా మాట్లాడుతూ 128 కొత్త అంగన్వాడీ భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ విడుదల చేసిందన్నారు. రెండవ విడత రివాల్వింగ్ ఫండ్ కూడా జమ చేశామని, అయితే నేటికీ పునాది గోతుల స్థాయిని అనేక అంగన్వాడీ భవన నిర్మాణాలు దాటకపోవడంపై మండిపడ్డారు. 20 భవనాలు మాత్రమే శ్లాబ్ స్థాయి పనుల వరకు వచ్చాయంటే, నిర్మాణంలో ఎంత నిర్లక్ష్యం జరుగుతుందో స్పష్టమౌతోందని అసంతృప్తి వ్యక్తం చేసారు. పాడేరు నియోజకవర్గంలో 15, అరకులో 30 అంగన్వాడీ కేంద్రాలు ఇంకా పునాదుల స్థాయిలో ఉన్నాయని, వాటి నిర్మాణాలు పూర్తి చేసే బాధ్యతలను సంబంధిత సిడిపిఒలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు చేపట్టాలని ఆదేశించారు. 11 మంది సిడిపిఒలు, 62 మంది సూపర్‌వైజర్లు ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. భవన నిర్మాణాల వేగవంతం చేసేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సచివాలయాల్లో ప్రభుత్వం నియమించిందని, అయినా ఆశించిన పురోగతి లేదన్నారు. పనుల పురోగతినిమహిళా పోలీసులు పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యమైన భవన నిర్మాణ సామగ్రి కొనుగోలు చేయాలని స్పష్టం చేసారు. మన బడి నాడు నేడు పాఠశాలల సిమెంటు తీసుకుని పనులు చేయాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ఇఇ డివిఆర్‌ఎం రాజు, 11 మండలాల సిడిపిఒలు, సూపరింటెండెంట్ జిఆర్‌సిహెచ్.మూర్తి పాల్గొన్నారు.

వికలాంగులకు స్కూటీలు అందజేత



స్కూటీలను పంపిణీ చేస్తున్న ఎంపిపి, సర్పంచ్‌లు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : ఎపి వికలాంగుల సంక్షేమ శాఖ, ట్రైబల్ డిజేబుల్ హెల్పర్ సొసైటీ ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ఏడుగురు వికలాంగులకు వందశాతం రాయితీతో మూడు చక్రాల స్కూటీలను మంగళవారం పంపిణీ చేశారు. అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ సిపార్సు మేరకు ఇవి మంజూరుకాగా, ఆయా లబ్ధిదారులకు ఎంపిపి రంజపల్లి ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అందజేశారు.కార్యక్రమంలో ఎంపిటిసి భీమరాజు, డిఆర్‌డిఎ ఎపిడి జల్లిపల్లి మాధవి, ట్రైబల్ డిజేబుల్ వెల్ఫేర్ సొసైటీ అల్లూరి జిల్లా ఇన్‌ఛార్జి ధర్మయ్య, అనంతగిరి, అరకువేలీ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల పిడబ్ల్యుడి మండల కోఆర్డినేటర్లు పూజారి రామనాగేశ్వరరావు, శోభ రామారావు, యాదయ్య, కైలాష్ పాల్గొన్నారు.

అర్జీలపై అధికారుల 'స్పందన'

మారుమూల గ్రామాల్లో పర్యటించి, సమస్యలను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాస్తవ



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి-పెదబయలు : తాగునీరు, రహదారుల సౌకర్యాలను కల్పించాలని కలెక్టరేట్ స్పందనలో గిరిజనుల వినతికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని మారుమూల కుంతర్ల గ్రామంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాస్తవ సుడిగాలి పర్యటన చేసి, సమస్యలపై పరిశీలన జరిపారు. కుంతర్లలో గ్రావిటీ పథకాన్ని పరిశీలించారు. నీటి ఎద్దడికి కారణాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. కుంతర్ల, పుట్టపాడు గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్మాణానికి రూ.16లక్షల నిధులు మంజూరైనా, ఇంకా టెండర్లు ఖరారు కానందున పనులు జరగలేదని సంబంధిత అధికారులు అసిస్టెంట్ కలెక్టర్‌కు విన్నవించారు. తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణమే రూ.రెండు లక్షలతో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి, పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కుంతర్లు నుంచి గడ్డిబంద వరకు నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మించి, రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని గిరిజనుల అభ్యర్థనపై గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి ధ్రువను ప్రశ్నించారు. కుంత్రేలు నుంచి బొంగజంగి వరకు ట్రైబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్ కింద ఇప్పటికే అంచనా ప్రతిపాదనలు నివేదించినట్లు అసిస్టెంట్ కలెక్టర్‌కు గిరిజన సంక్షేమ విభాగం ఇఇ విన్నవించారు. అనంతరం గ్రామ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బడిబయట ఉన్న పిల్లల వివరాలపై ఆరా తీసి, వారందరినీ తిరిగి బడిబాట పట్టించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్ పూర్ణయ్య, మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్ సంజీవరావు కుంతుర్ల ఎంపిటిసి కార్యదర్శి కాశీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

అంబరాన్నంటిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు

వాయిద్య శబ్దాలతో దద్దరిల్లిన అరకులోయ
సంప్రదాయ నృత్యాలతో సందడిగా కళావేదిక
తిలకించి, తన్మయులైపోయిన గిరిజనం, పర్యాటకులు



సంబరాల ప్రారంభ వేడుకలో మధు, మంతెన సీతారాం, అప్పలనర్స తదితరులు

ప్రజాశక్తి- అరకులోయ/ రూరల్ : ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదవ మహాసభల సందర్భంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆట పాట మాట అనే నినాదంతో నిర్వహించనున్న ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బసవ పున్నయ్య ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎంపీ పి.మధు ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు మంగళవారం మునుపెన్నడూ లేని విధంగా మరుగున పడిపోయిన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావి ప్రపంచానికి చాటిచెప్పేలా స్వాతంత్ర సమర యోధుడు, ఆదివాసీ పోరాట యోధుడు మల్రి కామయ్య కళావేదిక వద్ద ప్రదర్శించిన వివిధ కళా ప్రదర్శనలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించాయి. మొదటి రోజు ఈ వేదికపై ప్రదర్శించిన 10 రకాల కళారూపాలు అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, పునరుజ్జీవాన్ని పోసాయి. మన్య ప్రాంతంలో జరిగే వివిధ ఉత్సవాలకు భిన్నంగా, గిరిజన సంస్కృతిక ప్రదర్శనలు స్థానికులు పర్యాటకులు ఆనందంగా తిలకించారు. గిరిజన సంస్కృతిక కళా ప్రదర్శనలను బసవ పున్నయ్య ట్రస్ట్ చైర్మన్ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారం డంకా బజాయించి ప్రారంభించారు.





సంస్కృతిక ప్రదర్శనలు ప్రారంభం నుంచే సభా ప్రాంగణం దద్దరిల్లింది. గిరిజన వాయిద్యం, పది రకాల థింసా ప్రదర్శనలు, బలి నాటకం, గిరిజన బాలికల నృత్య ప్రదర్శనలు, చింతూరు కొమ్ముకోయ నృత్యం, దుమ్మగూడ, చొంపి గ్రామానికి చెందిన గిరిజన సంస్కృతిక థింసా నృత్య ప్రదర్శనలు స్థానిక గిరిజనులతోపాటు ప్రేక్షకులు, పర్యాటకులను కట్టిపడేశాయి. అలాగే బొండం గ్రామానికి చెందిన సంకిడి పాట నృత్య ప్రదర్శనలు వీక్షకుల మనసును దోచాయి.

గిరిజన సాంస్కృతిక సంబరాల్లో పాల్గొన్న ప్రతి కళాబృందానికి ఆదివాసీ సంస్కృతిక సంబరాల నిర్వహణ కమిటీ నాయకులు గిరిజన సంఘం నాయకులు వివిధ పాఠశాలల గిరిజన ప్రధానోపాధ్యాయులు మెమొంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఎపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమానికి అధ్యక్షత వహించి, సజావుగా కొనసాగించారు. మాజీ ఎంపీ మధు, గిరిజన సంఘం నేతలు సురేంద్ర, మంతెన సీతారాం, రమణ, వి. ఉమామహేశ్వరరావు, వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, వి. మహేశ్వరరావు, కే రఘునాథ్, దేముడు, రామారావు, ప్రజానాట్యమండలి నాయకులు జోషి, రామన్న, వివి జయ గిరిజనులు వేసిన సంస్కృతిక నృత్య ప్రదర్శనలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేత



గిరిజనులు, చిన్నారులతో కలిసి ప్రదర్శనలు తిలకిస్తున్న నాయకులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం నేత సీతారామయ్య, వైస్ ఎంపిపి పెంటయ్య



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుండి నిర్వహించనున్న మహాపాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య పిలుపునిచ్చారు. పాదయాత్రపై ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కూటూరు గ్రామంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ముంపునకు గురవుతున్న భూమలకు నష్టపరిహారం తక్షణమే ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ వల్ల నిర్వాసితులైన ప్రతి గిరిజనులకు భూమికి భూమి ఇవ్వాలన్నారు. నిర్వాసితులకు ఇచ్చిన ప్రతి భూమికి సాగునీటి వసతి ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 20 నుండి జులై 9 వరకు నెల్లిపాక నుండి విజయవాడ వరకు 18 రోజులు 400 కిలోమీటర్లు, 1000 మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముంపు గ్రామాలను కలుపుతూ సాగే ఈ పాదయాత్రకు నిర్వాసితులు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పాయం శేఖర్, నాయకులు పద్దం రాజు, శ్రీరాములు, నూపా రాజు, చిచ్చుడి రాజయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు కన్నారావు మృతి

నివాళులర్పించిన జిల్లా, మండల నేతలు



కన్నారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం వేకవారిగూడెం గ్రామానికి చెందిన సిపిఎం శాఖ కార్యదర్శి ఉయక కన్నారావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా, మండల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ తదితరులు కన్నారావు మృతదేహాన్ని సందర్శించి, ఎర్ర జెండా కప్పి పూలమాలతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఉయక కన్నారావు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పార్టీ ఎప్పుడు, ఏ పిలుపు ఇచ్చినా అమలు చేసేవాడని పేర్కొన్నారు. అతి చిన్న వయసులో చనిపోవడం ఆ కుటుంబానికి, సిపిఎంకు తీరని లోటన్నారు. కన్నారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తామన్నారు. కన్నారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మండల వ్యవసాయ శాఖాధికారిగా ఉమాదేవి



మండల వ్యవసాయాధికారి ఉమాదేవికి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల వ్యవసాయశాఖ అధికారిగా డి.ఉమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వ్యవసాయ అధికారిగా పనిచేసిన కృష్ణవేణి చీడికాడ మండలానికి బదిలీపై వెళ్లారు. ఉమాదేవి ఎలమంచిలి నుండి ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది ఉమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు.

టైఫాయిడ్, పచ్చ కామెర్లతో

మినీ అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-అడ్డతీగల



సత్యవతి (ఫైల్‌ఫొటో)

అడ్డతీగల మండలంట వీరవరం పంచాయతీ చాకిరేవుల గ్రామంలో అంగన్వాడీ మినీ వర్కర్‌గా పనిచేస్తున్న బోడగా సత్యవతి (35) టైఫాయిడ్, పచ్చ కామెర్లతో కాకినాడ జిజిహెచ్‌లో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. బంధువుల కథనం ప్రకారం.... సత్యవతికి ఎనిమిది రోజుల క్రితం జ్వరం రావడంతో అడ్డతీగల సిహెచ్‌సికి వెళ్లగా రక్త పరీక్షలు చేశారు. అందులో టైఫాయిడ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యం అందించారు. మూడు రోజులపాటు వైద్యం చేసినా ఆమె పరిస్థితి కుదుటపడకపోవడంతో కాకినాడ జిజిహెచ్‌కి రిఫర్ చేశారు. రక్తపరీక్షలు చేయగా టైఫాయిడ్, పచ్చకామెర్లు ఉన్నట్లుగా నిర్ధారించారు. ప్లేట్లెట్స్ పడిపోవడంతో పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యవతి భర్త వెంకటేశ్వరరావు తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రశాంత్ కుమార్ పదవ తరగతి, రెండవ కుమారుడు జాన్ విక్టర్ 9వ తరగతి చదువుతున్నారు. సత్యవతి మృతి పట్ల అడ్డతీగల సిడిపిఓ దీప్తి సంతాపం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల, సిఐటియు మండల అధ్యక్షుడు గుల్లల సురేష్ బాబు, సిఐటియు రాష్ట్ర నాయకులు పి రామరాజు సత్యవతి మృతికి తీవ్ర సంతాపం తెలియజేశారు.

నేడు గంటం దొర శత వర్ధంతి

ప్రజాశక్తి -కొయ్యూరు

స్వాతంత్ర్య సమర యోధుడు, అల్లూరి సీతారామరాజు ముఖ్య అనుచరుడు గాము గంటందొర శత వర్ధంతి కార్యక్రమం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బట్టపనుకులు పంచాయితీ పరిధి లంకవీధిలో ఈ నెల 7న నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గంటం దొర విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గాము కుటుంబాలను ఆదుకోవాలి

విగ్రహావిష్కరణలు, సభలతో హడావుడి చేయడం కాకుండా స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయినా దేశం కోసం ప్రాణాలర్పించిన గాం గంటందొర, గాం మల్లుదొర కుటుంబ సభ్యులకు నేటికీ ఆశ్రయం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 11 కుటుంబాలు గూడు, నీడ లేని దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గాం కుటుంబ సభ్యులకు సత్కారాలు, సన్మానాలు తప్పితే, చేసిందేమీ లేదని విమర్శించారు. విగ్రహాలు ఆవిష్కరించి పరోక్షంగా రాజకీయ లబ్ధి పొందడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా గాం గంటందొరి, మల్లుదొర కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు తీవ్ర వడగాల్పులు

ప్రజాశక్తి- రంపచోడవరం

రంపచోడవరం డివిజనల్ పరిధిలో బుధవారం తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ఏడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వాతావరణ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏడూ మండలాల్లో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. దూర ప్రయాణాలు చేయొద్దని సూచించింది.



భూమి పూజ చేస్తున్న ఎంపిపి బడుగు రమేష్, చిత్రంలో జెడ్‌పిటిసి వారా నూకరాజు

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని నల్లగొండ పంచాయతీ పరిధిలో రహదారి, సెల్ టవర్ నిర్మాణ పనులకు ఎంపిపి బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఏఎంసీ చైర్ పర్సన్ జైతి రాజులమ్మ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నల్లగొండ నుండి బోయవుట కొత్తవీధి వరకు రహదారి నిర్మిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యను నెల రోజుల్లో పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు ఏఎంసీ డైరెక్టర్ కమలమ్మ, వైస్ సర్పంచ్ భవాని, వార్డు మెంబర్లు దేవి, లక్ష్మి, రాజేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, వీఆర్పీలు దేవుడు రాజు, గంగరాజు, సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, గృహ సారధి నాగమణి, వైసీపీ నేతలు కోనేపు అచ్యుత్, ఎం.శివ, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి-విఆర్.పురం

ఆదివారం ఈదురుగాలులు సృష్టించిన బీభత్సానికి మండలంలోని ఉమ్మడివరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టు నేలకొరిగి ప్రహరీపై పడడంతో ఈ గోడ కూలిపోయింది. వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కూలిపోయిన ప్రహరీని తక్షణమే పునర్నిర్మించాలని ఉమ్మడి వారం గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే పాఠశాల పశువులకు నిలయంగా మారే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్కూలు ప్రహరీని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



చెట్టు పడి ప్రహరీ కూలిపోయిన దృశ్యం



సత్కరిస్తున్న నిర్మల కాన్వెంట్ సిస్టర్స్

హ్యూమన్ రైట్స్ నేతలకు సత్కారం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పిరిడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాసరావులను మంగళవారం ఎండపల్లివలస నిర్మల కాన్వెంట్‌లో ఘనంగా సత్కరించారు. కాన్వెంట్ సిస్టర్స్ దుశ్శాలువాతో సత్కరించి, వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



డాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

గ్రంథాలయంలో డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం డాన్స్ పోటీలను నిర్వహించారు. 20 మంది చిన్నారులు ఉత్సాహంగా డాన్స్‌పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ సునీత, సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : ఒడిశా ఘోర రైలు ప్రమాద మృతులకు మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో వెలిగించిన కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు భరోసానివ్వాలని కోరారు. అలాగే ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన వారికి కోలుకునే వరకు మెరుగైన ఉచిత వైద్యసేవలను అందించాలని కోరారు. సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో కర్రి శ్రీనుబాబు, శ్రీపాదుల గోవిందరావు, కర్రి బాబూరావు, బండి నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, బండి శివమణి, కర్రి కోటేశ్వరరావు, నగిరెడ్డి ఆదినారాయణ, కర్రి నాగు, బండి పేరయ్య, శియ్యాదుల విక్కీ పాల్గొన్నారు

శిక్షణార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక స్కేటింగ్ రింగ్ వద్ద రెయిన్ రియ షాతోకన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. తొమ్మిది మంది క్రీడాకారులు బెల్ట్ టెస్ట్ నిర్వహించినట్లు మార్షల్ ఆర్ట్ అకాడమీ కోచ్ ప్రసాద్ తెలిపారు. వీరిలో హేమంత్ బ్లాక్ బెల్ట్ సాధించగా, వై అనన్య, బి దైవిస్ ఆరెంజ్ బెల్ట్ సాధించగా, ఎల్ శోభిత్ బ్లూ బెల్ట్, జస్విత భవ్య, మహాలక్ష్మి లిఖితోరామ్, ఆర్ నైతిక ఎల్లో బెల్ట్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కిషోర్ పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులకు ప్రోత్సాహం

మారథాన్ అథ్లెట్లకు బూట్లు అందజేసిన పిఒ అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ: గిరిజన క్రీడాకారులకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందించనున్నట్లు ఐటిడిఎ పిఒ అభిషేక్ భరోసానిచ్చారు. బెంగళూరులోని కంఠీరవ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన టిసిఎస్ వరల్డ్ 10కె రన్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరచడం ద్వారా ఈ ఏడాది చివరిలో డిసెంబర్ 10న గోవాలో జరిగే మారథాన్ పోటీలను ఎంపికైన అరకులోయ మండలం గరడగుడ గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారుడు కిల్లో బుద్ధు, అనంతగిరి మండలం తుమ్మవలస గ్రామానికి క్ర్ర గోపీలను పిఒ అభిషేక్ అభినందించారు. మారథాన్‌లో మరింత రాణించాలని ఆకాంక్షిస్తూ, వారికి రూ.50వేలు విలువైన మారథాన్ షూస్‌ను ఐటిడిఎ ద్వారా అందజేశారు. మారథాన్ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని పిఒ అభినందించారు. కాగా తమకు ఎంతో అత్యవసరమైన మారథాన్ బూట్లను అందించి, సహకరించిన పిఒ అభిషేక్‌కు గిరిజన క్రీడాకారులు, స్థానిక నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



మారథాన్ షూస్ అందజేస్తున్న పిఒ అభిషేక్

గిరిజనులకు దోమ తెరలు, చెత్తబుట్టల పంపిణీ



దోమ తెరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని నుర్మతి అవుట్‌పోస్ట్ చుట్టుపక్కల గ్రామాలలో గిరిజనులకు దోమతెరలను, డస్ట్ బిన్‌లను పాడేరు ఎఎస్‌పి ధీరజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లో వేసి, గ్రామానికి దూరంగా పారేయాలని సూచించారు. అలాంటప్పుడు పారిశుధ్యం పరిరక్షణతోపాటు దోమల బెడద తద్వారా వ్యాధుల బెడద నుంచి బయటపడవచ్చన్నారు. సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిఆర్‌పిఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిఆర్‌పిఎఫ్, లోకల్ పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి- అనంతగిరి : ఈదురుగాలులకు దెబ్బకు రేకులు ఎగిరిపోయిన మండలంలోని వేంగడ పంచాయతీ సూకురుపుట్టు పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొద్దిరోజుల క్రితం గాలుల దెబ్బకు ఈ పాఠశాల పైకప్పులోని రేకులన్నీ ఎగిరిపోయాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఘటనసమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు. గాలులు దెబ్బకు ఏకంగా పైకప్పు ఎగిరిపోయేంతగా పైపైనే పనులు చేయడం వల్లే ఇలాంటి ప్రమాదం సంభవించిందనిఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఈలోగానే పాఠశాల పైకప్పుకు మరమ్మతులు చేయించాలని స్థానికులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే సమయంలో మునుపటిలా గాలొస్తే ఎగిరిపోకుండా పటిష్టంగా పైకప్పు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



పైకప్పు రేకులు ఎగిరిపోయిన సూకుడుపుట్టు పాఠశాల భవనం

ఆదరణ పథకాన్ని పునరుద్ధరించండి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : బిసి వృత్తిదారులను ఆదుకునేందుకుగత టిడిపిప్రభుత్వ హయాంలో అమలుచేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతోపాటు పలువురు మత్స్యకారులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఓను కలిసి వినతిపత్రం అందజేశారు. మత్స్యకార గ్రామమైన రేవుపోలవరం మత్స్యకారులు చేపల వేటకు వలలు ఇతర పనిముట్లు కోసం ఎనభై మంది దరఖాస్తు చేసుకుని, సుమారు రూ.రెండు లక్షలను డిడి రూపంలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించామన్నారు. తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథకాన్ని కొనసాగించకుండా, తాము కట్టిన డిపాజిట్ వాపసు చేయకుండా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో మత్స్యకారులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఆదరణ పథకానికి తాము కట్టిన డిపాజిట్ డబ్బులు వాపసు చేయడమో, లేకుంటే పథకాన్ని పునరుద్ధరించి, పనిముట్లు అందించడమో ఏదో ఒకటి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోడ లోవరాజు, గంపల అప్పన్న ఎరిపల్లి రమనబాబు చేపల గోవిందు, గనగల్ల గోపాలకృష్ణ, ఏరిపల్లి జగదీష్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలో మోదకొండమ్మ పండగ మంగళవారం వైభవంగా జరిగింది తెల్లవారుజాము నుండి అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి దేవాలయంతో పాటు శతకం పట్టు వద్ద భక్తులు ఘటాలతో భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మండుటెండలో చెప్పులు లేకుండా మహిళలు ఘటాలు తీసుకొచ్చి అమ్మవారిని దర్శించుకుని సమర్పించడం విశేషం. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నీడ కల్పించేందుకు టెంట్లు వేయడంతో భక్తులకు కొంత ఉపశమనం లభించింది.

పండుగ సందర్భంగా అమ్మవారిని వివిధ పార్టీల రాజకీయ నేతలు దర్శించుకున్నారు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, టిడిపి నేతలు దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ నేల వేషాలు, బండ్ల వేషాలతో పండగ ఊరేగింపు నిర్వహించారు. పండుగల సందర్భంగా .పలు చోట్ల ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు

పండగ సందర్భంగా అనేక చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భోజనాలు, మజ్జిగ, మంచినీరు, ప్రసాదం వితరణ పెద్దఎత్తున పంపిణీ చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భారీ ఫ్లెక్సీల ఏర్పాటు

మోదకొండమ్మ పండుగ సందర్భంగా మాడుగుల పట్టణమంతా భారీ ఫ్లెక్సీలతో నిండిపోయింది. పండగ విచ్చేసిన బంధుమిత్రులు, అతిథులకు స్వాగతం పలుకుతూ వివిధ రాజకీయ పార్టీలతోపాటు వ్యాపారులు, మరికొందరు వ్యక్తిగతంగానూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయిశారు. దుర్గాదేవి మోదమాంబ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సుందరరాజు, గౌరవ అధ్యక్షులు కుక్కర మోదకొండ, ఉపాధ్యక్షులు కర్రి దేవి ప్రసాద్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఆకట్టుకుంది.

ఉపాధి చట్టం పరిరక్షణకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి -నక్కపల్లి : వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్న నేటి తరుణంలో కూలీలను ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నెల్లిపూడిలోఉపాధి కూలీలతో సమావేశంలో మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి చట్టాన్ని కాపాడేందుకు కూలీలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోజువారీ రూ.600 వేతనంతో ఏడాదికి 200 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు భరణికుల రాము, సిఐటియు జిల్లా నాయకులు మామిడి నానాజీ పాల్గొన్నారు.

సకాలంలో చెల్లిస్తే శ్రీనిధి బ్యాంకు రుణాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించిన డ్వాక్రా సంఘాలకు రూ. రెండు లక్షల నుంచి రూ20లక్షల వరకు రుణాలు అందిస్తామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీనిధి ఉన్నతి పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలను పొందే లబ్ధిదారులు సకాలంలో చెల్లించాలన్నారు..రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపంపై వివరిస్తూ, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బాల్యవివాహాలు నిర్మూలనకు సహకరించాలని, చిన్న వయసులోనే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో శ్రీనిధి ఎజిఎం సునీత, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఎపిఎం ఉషాదేవి, మేనేజర్ కరుణానిధి, సిసిలు రాజు, ప్రకాష్, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సురభి కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి-మాడుగుల: కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సురభి కళాకారుడు అర్ వేణుగోపాలరావు, వారి బృందంలోని ఇతర సభ్య కళాకారులను మాడుగుల మాజీ సర్పంచ్ స్వర్గీయ మండల జయ శ్యామలరావు కుటుంబ సభ్యులు వారి నివాసంలో ఘనంగా సత్కరించారు. వేణగోపాలరావుతోపాటు ఇతర కళాకారులు శాంతి, మానస వీణ, మంజురోహిణి, నైమిక, దవళిక తదితరులను సత్కరించి, వస్త్రాలు, రూ.11 వేల నగదు బహుకరించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీమణి ధనలక్ష్మి, కుమారులు మండల వాసు, కనకాజీ, కుమార్తె అమ్మాజీ, కోడలు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోషి సుబ్బలక్ష్మి(సునీత) పాల్గొన్నారు.



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న రైల్వే డిఆర్ఎం అనుప్ సత్పతి

పర్యావరణ పరిరక్షణకు రైల్వే కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజన్ సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు కంకణం కట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతపై ఇతరులను చైతన్యపరుస్తామంటూ ప్రతిజ్ఞబూనారు. అనంతరం డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కమ్యూనిటీ పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి డాల్ఫిన్‌నోస్ కాలనీలో ఓపెన్ జిమ్నాసియంతో నూతనంగా అభివృద్ధి చేసిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. కాలనీలో ఎన్నో ఏళ్లుగా పొదలు, చెత్తా చెదారంతో నిండిన ఖాళీ స్థలంలో ఈ సౌకర్యం ఏర్పాటు చేసి కాలనీ వాసులకు మేలు చేసినట్టు వెల్లడించారు. రైల్వే స్టేడియంలో పునర్నిర్మించిన వాకర్స్ పార్కును ప్రారంభించారు. అనంతరం రైల్వే సిబ్బంది, ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు పారిజాత సత్పతితో కలిసి మర్రిపాలెం నార్త్ రైల్వే కాలనీకి వెళ్లి మొక్కలు నాటారు.

అటవీ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో అటవీ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో అటవీ భూముల రక్షణ, సర్వే, జిల్లాలో హరిత వనాల పెంపకం, సముద్ర తీర ప్రాంత సంరక్షణ తదితర అంశాలపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ రక్షణలో భాగంగా అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో నిఘాను పటిష్టం చేయాలన్నారు. హరిత వనాల పెంపకంలో భాగంగా జులైలో 15 వేల మొక్కలకు జియో ట్యాగింగ్ చేసి, పూర్తి సంరక్షణ చర్యలతో నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఫారెస్ట్, జివిఎంసి అధికారులను ఆదేశించారు. పరవాడ మండలం ఇస్లాంపేట గ్రామంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సర్వే చేయాలని విఎంఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. విశాఖ ఆర్‌కె బీచ్‌లో కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు చేపట్టి అదనపు లైట్లు, ఆర్టిఫిషియల్ లైట్లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడం వల్ల సముద్ర తాబేళ్ల గుడ్ల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకురాగా ఆయన స్పందిస్తూ నో లైట్ జోన్లు ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 181 కేసులు బుక్ చేశామని, తద్వారా రూ.14.26 లక్షలు వసూలైందని డిఎఫ్ఒ అనంత శంకర్ ఈ సందర్భంగా తెలిపారు. నాలుగు వన్య మృగాల కేసులు వివిధ దశల్లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో గంజాయి పెంపకం, అక్రమ రవాణా లేకుండా చూడాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోందని, అరికట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ అధికారులు రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో జాయింట్ సర్వే చేసి అటవీ భూముల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

డాక్టర్ శివానందకు సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.శివానంద బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో అతన్ని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ శివానంద సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పేదలకు పెద్దదిక్కుగా ఉన్న కెజిహెచ్‌లో రోగులకు ఇంకా మెరుగైన సేవలు అందించాలన్నారు. పాలనలో డాక్టర్ శివానంద తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయులకు బదిలీ పాట్లు

అత్యధిక పోస్టులు బ్లాక్‌లో పెట్టిన విద్యాశాఖ
మైదానం నుంచి ఏజెన్సీకి పలువురు
ఆప్షన్ గడువు పెంచాలంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయులు బదిలీ పాట్లు పడుతున్నారు. విద్యాశాఖ ఉపాధ్యాయ ఖాళీలు చూపించడంలోనూ, ఆప్షన్లు పెట్టుకొనే వ్యవధి తక్కువగా ఇవ్వడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,500 మందికిపైగా ఉపాధ్యాయులు బదిలీ కానున్నారు. వీరంతా తమ పాయింట్లు ఆధారంగా బదిలీలకు సంబంధించిన ఆప్షన్లు పెట్టుకొనే అవకాశంలేకుండా విద్యాశాఖ చేసింది. అత్యధిక పోస్టులు బ్లాక్ చేసి, ఖాళీలు తక్కువ చూపించడంతో ఉపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకొనేందుకు అవస్థలు పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటి పోస్టులను మూడు, నాలుగు, ఐదు తరగతులు కలిసిన పాఠశాలల్లోనూ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లోనూ బ్లాక్ చేయకూడదన్న నిబంధనలున్నా ఆచరణలో అత్యధిక పోస్టులను విద్యాశాఖ బ్లాక్ చేసింది. దీంతో ఆప్షన్లలో పాఠశాలలను ఎంచుకొనే అవకాశం ఉపాధ్యాయులకు లేకుండా పోయింది. మైదాన ప్రాంతంలోని పోస్టులను బ్లాక్ చేసి, ఖాళీలు తక్కువగా చూపించడంతో దాదాపు 300 మంది ఎస్‌జిటిలు ఏజెన్సీలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడనుంది. అలాగే పాఠశాలలకు పోస్టులు కేటాయింపు సరిగాలేవని ఉపాధ్యాయులు అంటున్నారు. గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఆప్షన్లు పెట్టుకొనే గడువు బుధవారంతో ముగియనుంది. ఆప్షన్లు పెట్టుకొనే అవకాశం మంగళవారమిచ్చి, బుధవారంతో గడువు ముగించడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. పోస్టుల ఖాళీలు మంగళవారం సాయంత్రం పెట్టి.. బుధవారం నాటికి పూర్తిచేయాలని చెప్పడం ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిజేయడమేనని వారంటున్నారు. అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు ఆప్షన్లు పెట్టుకొనే గడువు గురువారం వరకూ పెంచాలని కోరుతున్నారు.

ఉద్యోగాల పేరిట యువతకు గాలం

రూ.లక్షల్లో వసూళ్లు.. నిరుద్యోగులకు కుచ్చుటోపీ
నగరంలో 'హిందుస్థాన్ స్కౌట్స్' అనధికార దందాలు
విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు ఫిర్యాదులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉద్యోగాలిస్తామంటూ ప్రకటనలు, ప్రచారంతో పబ్బం గడుపుకునే సంస్థలు విశాఖలో నానాటికీ అధికమవుతున్నాయి. నిరుద్యోగులను ఆర్థికంగా దోపిడీ చేస్తూ వారి జీవితాలతో ఆటలాడుకోవడమే లక్ష్యంగా విశాఖలో పలు బోగస్ యాజమాన్యాలు కొనసాగుతున్నా వాటిపై ఎలాంటి చర్యలూ ఉండడం లేదు. చదువుకున్న యువతీ, యువకుల ఆశలను ఆసరాగా చేసుకుని దండుకునేందుకు నగరంలోని ఉత్తర నియోజకవర్గంలో ఓ బోగస్ సంస్థ తన దుకాణం తెరిచింది. ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మేడపై ఓ ప్రాంగణంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ పేరుతో ఈ మోసాలకు సదరు యాజమాన్యం పాల్పడుతోంది. ఉద్యోగాల కోసం ఎదురుచూసే యువతీ యువకులకు తమ సంస్థ ద్వారా, సంస్థలోనూ ఉద్యోగాలిస్తామంటూ ఎర వేస్తూ వారి నుంచి రూ.లక్షలు గుంజుకుంటూ అనేక మందికి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వారి భాగోతం తాజాగా బయటపడింది.



హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కార్యాలయం

బోగస్ సంస్థలపై దృష్టిసారించని జిల్లా అధికార యంత్రాంగం

విశాఖ వంటి మెట్రోపాలిటన్ సిటీలో ఆర్థిక మోసాలు, నిరుద్యోగులకు టోకరా వంటివి షరామామూలుగానే సాగిపోతున్నా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఏ మాత్రమూ అప్రమత్తంగా ఉండడం లేదు. తాజాగా ఉత్తర నియోజకవర్గంలోని ఓ అధికార పార్టీ నాయకున్ని కొంతమంది నిరుద్యోగులు కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. ఎవరెవరి వద్ద ఎన్ని సంవత్సరాలుగా ఎంతెంత దోపిడీ చేశారో వివరించారు. దీంతో సదరు నేత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు నేరుగా లేఖ రాశారు. 'హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్' అనేది ఒక బోగస్ సంస్థ అని, నిరుద్యోగులను మోసం చేస్తోందని రూఢీ అయ్యిందని, తన వద్దకు నలుగురు బాధితులు వచ్చారని ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ఈ నకిలీ, అనధికార సంస్థపై చర్యలు తీసుకోవాలంటూ అందులో స్పష్టంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఈ సంస్థ కార్యకలాపాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, తక్షణమే ఈ సంస్థపై చర్యల దిశగా ప్రభుత్వం వెళ్లాలంటూ ఆ లేఖలో సదరు నాయకుడు కోరారు.

బోగస్ వ్యవహారాలను పక్కదారిపట్టించే దిశగా..

ఈ నేపథ్యంలో హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ నిర్వాహకులు తాజాగా ఓ తెలుగు పత్రికలో ప్రకటన ఇస్తూ 'ఉద్యోగాలిచ్చేస్తున్నాం రండి' అంటూ ప్రచారం చేపట్టారు. స్కౌట్ ఉపాధ్యాయులు, గైడ్ ఉపాధ్యాయులు (స్త్రీ, పురుషుల)కు వందల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు వెబ్‌సైట్‌ను డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.హెచ్ఎస్‌జిఆంధ్రప్రదేశ్.ఒఆర్‌జి అంటూ పేర్కొన్నారు. ఇలా ప్రధాన దినపత్రికలో ఇవ్వడం ద్వారా తమ అక్రమాలను కప్పిపుచ్చుకోవాలనే ప్రయత్నాల్లో యాజమాన్యం నిమగ్నమైందని నిరుద్యోగులు పలువురు ఆరోపిస్తున్నారు.

భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోరమాండల్ రైలు ప్రమాదం జరిగిన బహనాగా బజార్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనిలో భాగంగా ట్రాక్ వేయడం వల్లనూ, ర్యాక్‌లు అందుబాటులో లేకపోవడం వల్లనూ పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి మంగళవారం ప్రకటించారు. జూన్ 6న 12863 హౌరా- ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 18047 షాలిమార్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్, 12839 హౌరా-ఎంజిఆర్ చెన్నై మెయిల్, 22642 షాలిమార్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ రైళ్ళను, జూన్ 7న 12839 హౌరా-ఎంజిఆర్ చెన్నై మెయిల్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ -షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 12842 చెన్నై సెంట్రల్ -షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, 22831 హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్, 22842 తాంబరం-సర్తాగచి ఎక్స్‌ప్రెస్, 12254 భాగల్పూర్-ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 22503 కన్యాకుమారి- దిబ్రూఘర్, 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 12773 షాలిమార్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, జూన్ 8న 12864 ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ - హౌరా ఎక్స్‌ప్రెస్, 22888 ఎస్ఎంవి బెంగళూరు - హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్, జూన్ 9న 18048 వాస్కోడగామా- షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 22832 సత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా - ఎక్స్‌ప్రెస్, 12503 ఎస్ఎంవి బెంగళూరు-అగర్తలా హంసఫర్ ఎక్స్‌ప్రెస్. జూన్ 10న 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

పట్టాలెక్కనున్న కోరమాండల్

12841 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సాధారణ సర్వీస్ జూన్ 7 నుంచి షెడ్యూల్ ప్రకారం షాలిమార్ నుంచి 15:20 గంటలకు బయలుదేరుతుంది. కోరమాండల్ ప్రమాద కారణంగా చిక్కుకుపోయిన ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి షాలిమార్ వరకు ప్రత్యేక రైలును నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 02842 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి జూన్ 7 ఉదయం 7.00 గంటలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 19.50 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 20.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. ఈ రైలు ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, విశాఖపట్నం, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది

796వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేస్తూ సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్యమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 796వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యకర్తలు, హాస్పటల్ వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న విశాఖ నగరానికి వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, ప్రభుత్వ రంగంలోనే దీనిని కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆ రోజు తాము అమిత్ షా దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. విభజన హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతిపెద్ద పరిశ్రమైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అనపర్తి అప్పారావు, ప్రదీప్ కుమార్, జివిఎన్.చలపతి, కుమార్, జగన్, డి.అప్పారావు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల సమస్యపై 20న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓలా, ఉబర్ డ్రైవర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఈ నెల 20న చలో కలెక్టరేట్ కార్యక్రమం తలపెట్టినట్టు విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ తెలిపారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓలా, ఉబర్ గూగుల్ యాప్‌ను డెవలప్ చేసి డ్రైవర్లను లింక్ చేసుకుంటున్నాయన్నారు. మొత్తం పెట్టుబడిని డ్రైవర్లు, ఓనర్లే పెట్టుకుంటారన్నారు. కానీ సదరు సంస్థలు 30 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నాయని, ఇది చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే అతని కారును ఆపేస్తున్నారన్నారు. ఈ విషయమై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా సరైన పరిష్కారం చూపలేదన్నారు.